సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 20 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

23న ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని పర్యటన



కొమ్మినేని శ్రీనివాసరావు

సాక్షి, పాడేరు: ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 23న జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు పాడేరు చేరుకుంటారు. పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో అవర్‌స్టేట్ అవర్ లీడర్ మేధావుల సంఘం 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు కాఫీ అతిథిగృహం చేరుకొని రాత్రి బస చేస్తారు. 24వతేదీ ఉదయం 9 గంటలకు పాడేరు నుంచి బయలుదేరి బొర్రాగుహలు సందర్శిస్తారు. ఒంటిగంటకు అరకు చేరుకొని భోజనానంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు అనంతగిరి వెళ్లి రాత్రి బస చేస్తారు. 25వతేదీ ఉదయం 8 గంటలకు అనంతరిగిరిలో బయలుదేరి రాజమహేంద్రవరం చేరుకుంటారని అధికారవర్గాలు తెలిపాయి.

ఆధార్ సెంటర్లపై సమీక్ష



సమీక్షిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులు ఆధార్ నమోదు, అప్‌డేట్ చేసుకునేందుకు మండలానికి ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటుచేసినట్టు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఆధార్ సెంటర్ల పనితీరుపై శనివారం ఆయన తన చాంబరులో సమీక్షించారు. మారేడుమిల్లి మండలంలో మొబైల్ ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలో ఆధార్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో 16 ఆధార్ సెంటర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ, సచివాలయాల్లో 36 ఆధార్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఏజెన్సీలోని 36 సచివాలయాల పరిధిలో ఈనెల 22 నుంచి 26 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నమోదు చేయాలని ఆదేశించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, డివిజనల్ ఆధార్ కోఆర్డినేటర్ బి. డేవిడ్, ప్రోగ్రాం ఇన్ఫర్మేషన్ అధికారి మానవ్, క్షేత్రస్థాయి అధికారి పి.చంద్రకళ పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువతి మృతి



దుర్గ మృతదేహం

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీ ఆగంపాడు గ్రామానికి చెందిన యువతి కిముడు దుర్గ (20) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. కిముడు సింహాచలం, పుష్పలమ్మ దంపతులకు చెందిన కుమార్తె దుర్గ నాలుగు రోజులుగా జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలుతో బాధపడుతోంది.

ఈ నేపథ్యంలో ఆరోగ్యం విషమించి ఇంటి వద్దనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటర్ వరకు చదివింది. అంది వచ్చిన కుమార్తె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మార్గదర్శి అక్రమాలపై కొనసాగిన సోదాలు

మధురవాడ: మార్గదర్శి అక్రమాలపై మధురవాడ బ్రాంచ్‌లో మూడో రోజు శనివారం కూడా సోదాలు జరిగాయి. పీఎంపాలెం మెయిన్ రోడ్డులోని మార్గదర్శి మధురవాడ శాఖలో సీబీసీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఇతర శాఖల అధికారులు సాయంత్రం వరకు సోదాలు చేపట్టారు. డీఎస్పీ నాగేశ్వరి ఆధ్వర్యంలో మార్గదర్శి సిబ్బందితో పాటు చందాదారులను విచారించినట్లు సమాచారం. పలు రికార్డులను కూడా తనిఖీ చేసినట్లు తెలిసింది.



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ పరిశీలిస్తున్న జేసీ శివ శ్రీనివాస్



వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ బట్టి చిట్టిబాబు



వైఎస్సార్‌సీపీ నేతలతో సీలేరు సర్పంచ్ దుర్జో విజయానందం



పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరాజ్, పీవో అభిషేక్

పంచాయతీ ఉప ఎన్నికల్లో

ఫ్యాన్ ప్రభంజనం

- మూడు సర్పంచ్ స్థానాల్లో రెండు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం
- 14 వార్డు సభ్యుల స్థానాల్లో 11 చోట్ల ఆ పార్టీ అభ్యర్థులు కైవసం



పెదకోడాపల్లిలో సర్పంచ్ గెలుపుతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, పాడేరు: జిల్లాలో పంచాయతీ ఉప ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. శనివారం మూడు సర్పంచ్, 14 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. సీలేరు, పెదకోడాపల్లి సర్పంచ్‌ల స్థానాలను వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. 14 వార్డు సభ్యుల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 11 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు విజయం సాధించారు. రంపచోడవరం మండలం ఆకూరు మహిళా సర్పంచ్ మృతితో ఆ స్థానానికి ఎన్నిక లేకుండా ఆమె ఆడపడుచు వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కత్తుల సరస్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీలేరు, పెదకోడాపల్లి సర్పంచ్ స్థానాలకు వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు పాంగి దుర్జో, బట్టి చిట్టిబాబులు, శోభకోట సర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారు శశిభూషణ్‌నాయుడు గెలుపొందారు..

రాజకీయరంగు పులిమిన ప్రతిపక్ష పార్టీలు

పార్టీ రహితంగా జరగాల్సిన ఎన్నికలకు ప్రతిపక్ష టీడీపీ, జనసేన పార్టీలు రాజకీయ రంగు పులిమాయి. బహిరంగంగా మద్దతు తెలుపుతూ అభ్యర్థులను రంగంలోకి దించాయి. అత్యధిక మెజారిటీ స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. జిల్లాలో మొత్తం 57 వార్డు సభ్యుల స్థానాలకు గాను 43 ఏకగ్రీవం కాగా 14 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవమైన 43లో వైఎస్సార్‌సీపీ 23, టీడీపీ 12, సీపీఐ1, సీపీఎం 4,స్వతంత్రులు ముగ్గురు ఉన్నారు.

ప్రశాంతంగా ఉప ఎన్నికలు: జేసీ

పెదబయలు: జిల్లాలో పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం పెదకోడాపల్లి పోలింగ్ కేంద్రాన్ని వారు సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

154 ఓట్ల మెజారిటీ: సర్పంచ్ ఎన్నికకు సంబంధించి 2,915 ఓట్లకుగాను 1763 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి బట్టి చిట్టిబాబుకు 677 ఓట్లు, ప్రత్యర్థి అమ్మ కోటిబాబుకు 523 ఓట్లు వచ్చాయి. చిట్టిబాబు 154 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని జేసీ అందజేశారు. ఇంజరిలో పంచాయతీలో 8 వార్డులకు గాను ఆరు వార్డులు ఏకగ్రీవం కాగా, రెండు వార్డులకు ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్‌సీపీకి చెందిన 4వ వార్డు అభ్యర్థి కుర్రా విజయ 75 ఓట్లు, 12వ వార్డు అభ్యర్థి వంతాల చిలకమ్మ 65 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మొత్తం ఎనిమిది వార్డుల్లో ఏడు స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. దీంతో ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన కిల్లుడు నూకాలమ్మ ఎన్నికయ్యారు.

విజయోత్సవం : వైఎస్సార్‌సీపీ నేతలు గ్రామంలో విజయోత్సవం నిర్వహించారు. జైజగన్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

సీలేరులో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థికి పట్టం

సీలేరు: స్థానిక పంచాయతీ సర్పంచ్ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి పాంగి దుర్జో విజయం సాధించారు. శనివారం నిర్వహించిన పోలింగ్‌లో ఆయనకు 567 ఓట్లు, ప్రత్యర్థి టీడీపీ మద్దతు అభ్యర్థి పాంగి దశరథ్ 427 ఓట్లు వచ్చాయి. 135 ఓట్లు మెజారిటీతో దుర్జో గెలుపొందారు. బీజేపీ, జనసేన ఉమ్మడి మద్దతు అభ్యర్థి పాంగి సుమిత్రకు 65 ఓట్లు వచ్చాయి. దుర్జోకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.సత్యనారాయణ అందజేశారు. విస్తృత పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్, కౌంటింగ్ నిర్వహించారు. దుర్జో ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీపీ కుమారి పాల్గొన్నారు.

శోభకోట సర్పంచ్‌గా శశిభూషణ్ నాయుడు

హుకుంపేట: శోభకోట, బారమసి పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. శోభకోటలో సర్పంచ్‌గా పలాసి శశిభూషణ్ నాయుడు 406 ఓట్లతో విజయం సాధించారు. ఓల్డా, మఠం పంచాయతీల్లో వార్డు సభ్యులుగా కాందేలి సంతోష్‌కుమార్, మఠం రాములమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బారమసి పంచాయతీ 3వ వార్డు స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుదారు బారబోయిని మహేశ్వరరావు విజయం సాధించారు.

చింతపల్లి రూరల్: మండలంలోని చింతపల్లి పంచాయతీ నాలుగో వార్డుకు జరిగిన ఎన్నికల్లో రీమల ఝాన్సీరాణి, కుడుమసారి పంచాయతీ తొమ్మిదో వార్డుకు పాంగి లీలావతి విజయం సాధించినట్టు ఎంపీడీవో ఆశాజ్యోతి తెలిపారు.

దేవీపట్నం: మండలంలోని డీఎస్‌పాలెం పంచాయతీలో ఆరో వార్డు, దేవీపట్నం పంచాయతీ రెండో వార్డు సభ్యుని స్థానాలకు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కుండ్ల సన్యాసిరెడ్డి, కారం వెంకటలక్ష్మి విజయం సాధించారు.

రంపచోడవరం: మండలంలోని బందపల్లి పంచాయతీలో ఒక వార్డుకు జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరచిన పి. సీతారత్నం విజయం సాధించారు.

చింతూరు: డివిజన్ పరిధిలో శనివారం జరిగిన నాలుగు వార్డు సభ్యుల స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో మూడింటిని వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. తుమ్మల పంచాయతీ ఆరో వార్డుకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన కొవ్వాసి బాబూరావు, కొత్తపల్లి పంచాయతీ ఒకటో వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన కారం సుబ్బమ్మ 33 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గూడూరులో ఐదవ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో సీపీఎం బలపరిచిన సోడె సూరయ్య విజయం సాధించారు.

రెండు వార్డులు ఏకగ్రీవం

అడ్డతీగల: మండలంలోని దొరమామిడి, భీముడుపాకలు పంచాయతీల్లో రెండు వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నిక ఏకగ్రీవం అయినట్టు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. దొరమామిడి పంచాయతీ 5వ వార్డుకు చెదల మంగాయ్యమ్మ, భీముడుపాకలు పంచాయతీ 8వ వార్డు స్థానానికి దొని గౌరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు.

కూనవరం: మండలంలోని వెంకటాయపాలెంలో మూడో వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరిచిన కుచ్చలపాటి వెంకటరమణ 10 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.ఈ సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.



శోభకోటలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు



వెంకటాయపాలెంలో విజయోత్సవ ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణులు

చిత్తుగా ఓడిన 'టీడీపీ'

కొయ్యూరు: పెదమాకవరం, రేవళ్ల పంచాయతీల్లో రెండు వార్డు సభ్యుల స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ మద్దతు అభ్యర్థులు చిత్తుగా ఓడిపోయారు. రెండు స్థానాలను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు భారీ మెజారిటీతో కైవసం చేసుకున్నారు. రేవళ్లలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గొట్టుపల్లి బాల రాజులమ్మ టీడీపీ బలపరచిన చిలక దుర్గభవానీపై 69 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మొత్తం 139 ఓట్లకు 76 ఓట్లు పోలయ్యాయి. వీటిలో రాజులమ్మకు 69 ఓట్లు, భవానీకి కేవలం ఆరు ఓట్లు వచ్చాయని పోలింగ్ అధికారి రామకృష్ణ, ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. పెదమాకవరం ఒకటో వార్డు స్థానం ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరచిన నర్సి పద్మలత. టీడీపీ బలపరచిన నర్సి జయలక్ష్మిపై విజయం సాధించారు. పద్మలతకు 65, జయలక్ష్మికి 22 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, మహిళానాయకురాలు సావిత్రి మాట్లాడుతూ నడింపాలెంలో కూడా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థి గెలవాల్సి ఉందన్నారు. టీడీపీ నేతలు భయపెట్టి నామినేషన్ ఉపసంహరణ చేయించారని ఆరోపించారు. ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు.

బడి బయట పిల్లలను చేర్పించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శనివారం గిరిజన సంక్షేమశాఖ డీడీ, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలతో నిర్వహించిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని గ్రామ సచివాలయాల పరిధిలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన పిల్లల వివరాలపై ఆయన సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఆధార్ కార్డులు ఉండాలని సూచించారు. లేనివారిని గుర్తించి ఐటీడీఏఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌లో నమోదు చేయించాలన్నారు. పాఠశాలల్లో సమస్యలను తెలుసుకున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలన్నారు. మహిళా పోలీసులు పాఠశాలల సందర్శన వివరాలను ఆయన తెలుసుకున్నారు. స్కూలుకు రాని వారి వివరాలను ఉపాధ్యాయులు ఏటీడబ్ల్యూవోలకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. నాడు–నేడు పనులపై పీవో సమీక్షించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డీడీ జాన్ రాజ్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉపాధ్యాయులు ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆశ్రమ పాఠశాలలకు వచ్చే నిత్యావసర సరకులు నాణ్యంగా ఉంటేనే తీసుకోవాలన్నారు.ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాలల నుంచి బయటికి వెళ్లేటప్పుడు మూవ్‌మెంట్ రిజస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏటీడబ్ల్యూవోలు రామ తులసి, హాసిని, శాంతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



జి.మాడుగుల పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో రొట్టెలు పంపిణీ చేస్తున్న వీడియో గ్రాఫర్లు



రంపచోడవరంలో ఫొటోగ్రాఫర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జి.సన్యాసిరావు అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. అసోసియేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కె.బాబులాల్, సభ్యులు పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం ద్వారకాతిరుమల దత్తత ఆలయం నారాయణగిరిపై కొలువైన రంప వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం వరల్డ్ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. స్థానిక సూర్య ఫొటో గ్రాఫర్ శ్రీనివాసరావును సభ్యులు సత్కరించారు.

జి.మాడుగుల: శ్రీ మత్స్యమాడుగులమ్మ ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్వర్యంలో శనివారం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. రెయిన్‌బో డిజిటల్ ఫొటో గ్రాఫర్ మత్స్యరాస నారాయణరాజు బాలింతలు, గర్భిణులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్, అసోసియేషన్ మండల అధ్యక్షుడు జాన్‌రాజు పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

వచ్చే నెల 3న గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్‌సీ ఎగ్జామ్స్‌తో కలిసి సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 9 నుంచి 12.30 వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెలిసిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో..

ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్‌అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ :
సెప్టెంబర్ 3, 2023 (ఆదివారం)

వేదిక:
డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్,
రామాటాకీస్ దరి రీజనల్
కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

క్లుప్తంగా

గంజాయి అనర్థాలపై కళాజాత



గోమంగి వారపు సంతలో కళాజాత నిర్వహిస్తున్న కళాకారులు

పెదబయలు: మండలంలోని గోమంగి వారపు సంతలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం కళాజాత నిర్వహించారు. గిరిజనులు గంజాయి సాగుకు దూరంగా ఉండాలని, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కళాకారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వారపు సంతల్లో కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు బృందం సభ్యులు చెప్పారు.

ప్రేమ పేరిట యువతికి మోసం

పాడేరు రూరల్ : యువతిని ప్రేమ పేరుతో గర్భవతిని చేసిన భర్త, ఆ యువతి గర్భం తొలగించిన భార్యను అరెస్టు చేశామని పాడేరు సీఐ సుధాకర్ అన్నారు. వివరాలిలా ఉన్నాయి. హుకుంపేట మండలం మత్రిపుట్టు గ్రామానికి చెందిన యువతిని ములియపుట్టు గ్రామానికి చెందిన రేమలి సుందర రావు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేశాడు. తరువాత తనకు పెళ్లయిందని చెప్పి ఆమెతో పెళ్లికి నిరాకరించాడు. అయితే పెద్దలు గట్టిగా నిలదీయడంతో ఆ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, భార్యతో కలిసి ఆమె గర్భం తొలగించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరిపి నిందితులు రేమలి సుందర రావు, అతని భార్య గనితకుమారిలను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా జరుగుతుందని, మరికొన్ని విషయాలు వెలుగులోకి రావాలని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు.

కుమ్మేసిన కింగ్స్.. గర్జించిన లయన్స్

ఉత్కంఠగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్–2



అర్ధసెంచరీతో చెలరేగిన రాయలసీమ కింగ్స్ బ్యాటర్ వీరారెడ్డి

విశాఖ స్పోర్ట్స్: వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో ఏపీఎల్ టీ–20 రెండో సీజన్ ఉత్కంఠగా సాగుతోంది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై రాయలసీమ కింగ్స్ మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన రాయలసీమ కింగ్స్ లక్ష్య ఛేదనకే మొగ్గుచూపింది. గిరినాథ్ వేసిన తొలి ఓవర్‌లో ఒకే పరుగు చేసి బెజవాడ టైగర్స్ ఓపెనర్లు అభినవ్ 35 బంతుల్లో 44 (4x4, 2x6), మహీప్‌కుమార్ 44 బంతుల్లో 59(5x4, 3x6)తో తొలి వికెట్‌కు 89 జోడించారు. ఈ క్రమంలో 13.2 ఓవర్లలో టైగర్స్ 100 పరుగుల మార్క్‌ను దాటింది. తర్వాత రికీబుయ్(8), అవినాష్(7), మనీష్(14) ఔటయ్యారు. రాహుల్ 11, కెప్టెన్ షోయబ్ 3 పరుగులతో బెజవాడ టైగర్స్ ఐదు వికెట్లకు 152 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగించింది. గిరినాథ్, హరిశంకర్, వినయ్, సాకేత్, కమరుద్దీన్ ఒక్కో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ ఓపెనర్ అభిషేక్(9) 14 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరుకోగా, వంశీకృష్ణ(21) లెగ్ బిఫోర్‌గా లలిత్‌కు జట్టు స్కోర్ 59 పరుగుల వద్ద దొరికిపోయాడు. మరో ఓపెనర్ వీరారెడ్డికి కెప్టెన్ హనుమ విహారి తోడై స్కోర్‌ను 10 ఓవర్లు 78 పరుగులతో ముందుకు నడిపాడు. హనుమ విహారి(19) రాహుల్ బౌలింగ్‌లో షోయబ్‌కు క్యాచ్ ఇవ్వడంతో 108 పరుగుల వద్ద కింగ్స్ మూడో వికెట్ కోల్పోయింది. వీరారెడ్డి వ్యక్తిగత స్కోర్ 61 పరుగుల(x4, 4x6) వద్ద షోయబ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. తర్వాత వచ్చిన వినయ్‌ను డకౌట్‌గా లలిత్ వెనక్కి పంపాడు. గిరినాథ్ 15 బంతుల్లో 25 పరుగుల(2x4, 1x6)తో చెలరేగడంతో మరో ఓవర్ ఉండగానే కింగ్స్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. సాయిశ్రవణ్, సంపత్ కుమార్ చెరో ఆరేసి పరుగులు చేసి వెనుదిరిగారు. లలిత్ మూడు, షోయబ్, రాహుల్, సాయితేజ ఒక్కో వికెట్ తీశారు.

రైడర్స్ విజయాలకు బ్రేక్

విశాఖ స్పోర్ట్స్: వరస విజయాలతో దూసుకుపోతున్న కోస్టల్ రైడర్స్‌ను ఉత్తరాంధ్ర లయన్స్ నిలువరించింది. మరో మ్యాచ్‌లో టాస్ గెలిచిన రైడర్స్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్లు దత్తా(7), ప్రణీత్(8)లను 24 పరుగులకే లయన్స్ వెనక్కి పంపారు. కెప్టెన్ రషీద్(20) ఇన్నింగ్స్ చక్కదిద్దే క్రమంలో తపస్వీ బౌలింగ్‌లో వాసుకి క్యాచ్ ఇచ్చి వెనుతిరగడంతో 55 పరుగులకే మూడో వికెట్ కోల్పోయింది. హర్షవర్ధన్ 37 బంతుల్లో 44 (3x4, 5x6), మనోహర్(15)లతో కలిసి చిరంజీవి స్కోర్‌ను పరుగులెత్తించారు. అబ్దుల్లా(4)తో పాటు లేఖజ్ కేవలం ఒక్క పరుగుతో పెవిలియన్‌కు చేరారు. చిరంజీవి 23 బంతుల్లో 38(3x4, 2x6) పరుగులతో నిలవడంతో ఏడు వికెట్లకు 160 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ముగిసింది. అయ్యప్ప మూడు, అజయ్ రెండు వికెట్లు తీయగా తపస్వి, పృథ్వీ చెరో వికెట్ పడగొట్టారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాంధ్ర లయన్స్ బ్యాటర్లు ఆది నుంచే చెలరేగిపోయారు. ఓపెనర్లు గుల్ఫామ్ 19 బంతుల్లో 31(4x4, 2x6), కెప్టెన్ భరత్ 22 బంతుల్లో 54(6x4, 4x6)తో తొలి వికెట్‌కు 35 బంతుల్లోనే 77 పరుగులు జోడించారు. రాహుల్(12) ధాటిగానే ఆడగా 7.5 ఓవర్లలోనే 99 పరుగులకు జట్టు స్కోర్ చేరింది. తపస్వి(13), శ్రీనివాస్(11), శ్యామ్‌సుందర్(20) దూకుడుగానే ఆడగా... తేజస్వి(21), వాసు(0)అజేయంగా నిలిచి 17.3 ఓవర్లలోనే ఏడు వికెట్లకు 166 పరుగులు సాధించారు. సుదర్శన్ వేసిన బంతిని తేజస్వి డీప్ మిడ్ వికెట్ మీదుగా సిక్సర్‌గా తరలించడంతో మూడు వికెట్ల తేడాతో లయన్స్ విజయం సాధించింది. సుదర్శన్, దీపక్ రెండేసి వికెట్లు తీయగా ఆశిష్, స్టీఫెన్ చెరో వికెట్ పడగొట్టారు.



మ్యాచ్ ముగిసిన అనంతరం ఉత్తరాంధ్ర లయన్స్, కోస్టల్ రైడర్స్ జట్ల క్రీడాకారులు

వరుణుడి కరుణ కోసం పూజలు



దూసరపాము గ్రామ పొలిమేరల్లో పసుపు నీటిని జల్లుతున్న మహిళలు

రాజవొమ్మంగి: వానలు కురవాలని కోరుతూ దూసరపాము గ్రామంలో మహిళలు స్థానిక దుర్గమ్మ, లక్ష్మీ గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు గ్రామంలోని రైతు కుటుంబాలకు చెందిన మహిళలు వానలు కురవాలని కాంక్షిస్తూ ఆయా ఆలయాల ప్రాంగణాలను పసుపునీటితో శుద్ధి చేసి, ముగ్గులు వేసి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గ్రామంలోకి దుష్ట శక్తులు రాకుండా కపాడి, వానలు కురిపించాలని గ్రామదేవతలను వేడుకొన్నారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో పసుపు నీటిని జల్లారు.

సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం గుంటూరు–విశాఖపట్నం–గుంటూరు మధ్య రాకపోకలు సాగించే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గుంటూరు–విశాఖపట్నం(17239/40) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 20 నుంచి 22 వరకు రద్దయిందని పేర్కొన్నారు.

ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం మానుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీలేరు: సీలేరు సర్పంచ్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలు చేసిన కుట్ర రాజకీయాలకు స్థానికులు బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీ బలపర్చిన మద్దతు అభ్యర్థిని గెలిపించారని ఎంపీపీ కుమారి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. సీలేరులో సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ బలపర్చిన మద్దతు అభ్యర్థి పాంగి దుర్జో గెలుపు అనంతరం వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. ఓటర్లను మభ్యపెట్టి, భయపెట్టి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు గిడ్డి ఈశ్వరి, బీజేపీ నాయకులు రెండు రోజులు సీలేరులో ఉండి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసి తమ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రయత్నాలు చేశారన్నారు.

అయితే ప్రతిపక్షాలు చేసిన కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టి సరైన విధంగా బుద్ధి చెప్పారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి, సుపరిపాలనకు మద్దతు తెలియజేయడంతోనే దుర్జో గెలుపు సాధ్యమైందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరిన్ని విజయాలు సాధిస్తోందన్నారు. ప్రభుత్వంపై టీడీపీ, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. నాయకులు సాంబమూర్తి, స్వర్ణలత, బుజ్జి, శివరాం, వెంకటరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్



అపోలో ఆస్పత్రిలో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్ ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని

ఆరిలోవ: బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఆరోగ్య శ్రీ పథకం వర్తిస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్(బీఎంటీ) యూనిట్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. యూనిట్ పనిచేసే విధానం, రోగులకు అందించే వైద్య సేవల గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అపోలో క్యాన్సర్ సెంటర్‌లో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇక్కడ చికిత్స పొందే వారికి ఆరోగ్య శ్రీ వర్తిస్తుందని.. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదవారిపై వైద్య భారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో 3,257 వ్యాధులను చేర్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 90 శాతం కుటుంబాలు ఈ సేవలు వినియోగించుకుంటున్నాయని చెప్పారు. పేద విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుకునేలా రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.8,500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో విజయనగరం, నంద్యాల, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నంలోని వైద్య కళాశాలల పనులు పూర్తయ్యాయని.. ఈ ఏడాది సెప్టెంబర్ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఒక్కో కళాశాలలో 150 సీట్లు చొప్పున 750 సీట్లు భర్తీ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రజావైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రజలకు ఉచితంగా అన్ని వైద్య సేవలందేలా చర్యలు చేపడుతోందన్నారు.

చంద్రబాబు.. చంద్రబాబాగా..

చంద్రబాబు పాలనలో వైద్య రంగం నిర్లక్ష్యానికి గురైందని మంత్రి రజని అన్నారు. అధికారంలో ఉండగా ప్రజలకు మేలు చేయని చంద్రబాబు.. ఇప్పుడు ఏదో చేస్తానని ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. మంత్రాల పేరుతో మాయమాటలు చెప్పి చంద్రబాబు కాస్తా చంద్రబాబాగా మారుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామస్థాయి నుంచి వైద్య రంగాన్ని పటిష్టం చేశారని, ఆయనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. అపోలో అంకాలజిస్ట్ డాక్టర్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ యూనిట్ పనితీరు, అందించే వైద్య సేవల గురించి వివరించారు. రాష్ట్రంలో ఇది మొదటి బీఎంటీ యూనిట్ అని వెల్లడించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అపోలో రీజినల్ సీఈవో సుబ్రహ్మణ్యం, సీవోవో రామచంద్ర, వైద్యులు పాల్గొన్నారు.